క్లుప్తంగా

డిగ్రీలో స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

తొర్రూరు రూరల్: మండలంలోని నాంచారీమడూరు గ్రామ శివారులోని మహాత్మజ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల డిగ్రీ కళాశాల(పురుషుల) విభాగంలో స్పాట్ అడ్మిషన్లను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్ శనివారం తెలిపారు. బీకాం, బీఎస్సీ, బీఏ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు ఉన్నాయన్నారు. సర్టిఫికెట్లతో ఈనెల 15, 16తేదీల్లో కళాశాలలో హాజరు కావాలన్నారు.

గార్ల: గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరే విద్యార్థులకు ఈనెల 15, 16 తేదీలలో స్పాట్ అడ్మిషన్లు ఉంటాయని కలాశాల ప్రిన్సిపాల్ డి.రాజు శనివారం తెలిపారు.

జాబితా ప్రకారమే యూరియా పంపిణీ

కురవి: ఇకనుంచి రైతుబంధు జాబితా ప్రకారమే యూరియా పంపిణీ చేయనున్నట్లు సీరోలు తహసీల్దార్ పున్నంచందర్ తెలిపారు. శనివారం సీరోలు తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు రైతుబంధు పథకంలో ఉన్న రైతుల పేర్లను లిస్ట్ తయారు చేయనున్నట్లు తెలిపారు. జాబితాలో ఉన్న పేరు కలిగిన రైతులకు యూరియా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీరోలు ఎస్సై సంతోష్, ఏఓ చాయారాజ్, ఎంపీడీఓ గౌస్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా 9వ ర్యాంక్



ప్రగతి

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వెంకంపాడు గ్రామానికి చెందిన తప్పెట్ల నాగేష్, స్వర్ణ దంపతుల కుమార్తె తప్పెట్ల ప్రగతి శనివారం విడుదల అయిన ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చర్ రీసెర్చ్ 2025 ఫలితాలు వెలుబడ్డాయి. ప్రగతి కీటక శాస్త్రం, నెమటాలజీ సబ్జెక్ట్‌లో ఆల్ ఇండియా 9వ ర్యాంకు సాధించింది. ఎస్సీ వర్గంలో ఆల్ ఇండియా ఫస్ట్ ప్లేస్‌లో నిలిచి తెలంగాణ రాష్ట్రం నుంచి సత్తా చాటింది. ప్రగతిని గ్రామస్తులు అభినందించారు.

ఆర్థికసాయం



గూడూరు: మండల కేంద్రంలోని చెంద్రుగూడెంకు చెందిన చొప్పరి రమేష్, ఎండీ యాకూపాష ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుల మిత్రులు కలిసి శనివారం చొప్పరి రమేష్ కుటుంబానికి రూ.50 వేలు, యాకూపాష కుటుంబానికి రూ.50వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో ఖాసీం, కోరె పాపయ్య, ఉపేందర్, లక్ష్మణ్, శ్రీశైలం, సురేష్, వీరస్వామి, బాలయ్య పాల్గొన్నారు.

బొడ్డెమ్మ సందడి



గూడూరు: బతుకమ్మ పండుగకు ముందు తొమ్మిది రోజులు జరుపుకునే బొడ్డెమ్మ వేడుకలు శనివారం రెండోరోజు కొనసాగింది. గూడూరుతో పాటు పలు గ్రామాల్లో యువతులు, చిన్నారులు, మహిళలు పాటలు పాడుతూ సందడి చేశారు.

తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ హాస్టళ్ల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వాములు కావాలని శ్రీచైతన్య ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ పుల్లరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహంలో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లరావు హాజరై మాట్లాడుతూ.. ప్రతినెలలో ఒక శనివారం ప్రతి హాస్టల్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తే పిల్లల చదువుల పురోగతి, హాజరు పిల్లల ప్రవర్తన, చదువుల మూల్యాంకనం ఇతర అంశాలు తల్లిదండ్రులకు తెలుస్తుందన్నారు.

సన్మానం

మహబూబాబాద్ రూరల్: రైళ్లలో జనరల్ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్‌ను గుజరాత్ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సూరత్ పట్టణంలోని లింభాయత్ మార్కండేశ్వర మహాదేవ్ మందిరంలో పద్మశాలీలు శనివారం సన్మానించారు.

ఇద్దరి అరెస్ట్

డోర్నకల్: రైల్వే సామగ్రి దొంగతనం చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డోర్నకల్ ఆర్‌పీఎఫ్ పోలీసులు శనివారం తెలిపారు. రైల్వే సామగ్రి చోరీ చేసిన ఓ వ్యక్తి వాటిని మరో వ్యక్తికి విక్రయించగా చోరీ చేసిన వ్యక్తితోపాటు విక్రయించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

చిల్లర చిక్కులకు చెక్

- ఆర్టీసీ బస్సుల్లో డిజిటల్ చెల్లింపులు
- పల్లెవెలుగుల్లోనూ అందుబాటులోకి..
- ప్రయాణికులకు తప్పినతిప్పలు

సండే స్పెషల్



ఆర్టీసీ బస్సుల్లో ఫోన్‌పే చేస్తున్న ప్రయాణికుడు

పెద్దవంగర: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారందరికీ ఎప్పటి నుంచో ఇబ్బందికరంగా ఉన్న చిల్లర సమస్యకు ఇక చెక్ పడింది. ఇప్పటి వరకు డీలక్స్ బస్సుల్లో మాత్రమే అందుబాటులో ఉన్న డిజిటల్ చెల్లింపు సౌకర్యాన్ని ఇప్పుడు పల్లెవెలుగు బస్సులోకి విస్తరించింది. ఆర్టీసీలో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్ ద్వారా ప్రయాణికులు టికెట్ రుసుములు చెల్లించే వీలు కలిగింది. దీంతో చిల్లర కోసం పడే తిప్పలు తగ్గి అటు కండక్టర్లు, ఇటు ప్రయాణికులకు ఊరట లభించింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరికీ చాలా కాలంగా ఇబ్బంది కరంగా మారిన సమస్య చిల్లర. ప్రయాణికులు చెల్లించాల్సిన టికెట్ రుసుములు ఎక్కువగా రూ.10, రూ.20, రూ.50 నోట్లతో మాత్రమే ఉండడంతో కండక్టర్ల వద్ద తగినంత చిల్లర లేకపోవడం పెద్దచిక్కుగా మారింది. దయచేసి చిల్లర ఇచ్చి సహకరించండండీ.. అనే బోర్డులు బస్సుల్లో తప్పనిసరి దృశ్యమై ఉండేవి. ఇకపై ప్రయాణికులు డిజిటల్ చెల్లింపు పద్ధతుల ద్వారా కండక్టర్లకే నేరుగా టికెట్ రుసుము చెల్లించవచ్చు.

ప్రయాణికుల ఊరట..

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి వచ్చిన తర్వాత పల్లెవెలుగు బస్సుల్లో టికెట్ రశీదులు జారీ చేయడంలో చిల్లర కొరత మరింత తీవ్రమైంది. ఇప్పటికే ఉచిత ప్రయాణ సౌకర్యంతో కండక్టర్ల పని భారం పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో చిల్లర లావాదేవీలు కోసం వచ్చే ఇబ్బందులు మరింత పెరిగి చాలా సందర్భాల్లో కండక్టర్లు, ప్రయాణికుల మధ్య వాగ్వివాదాలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో ఈ డిజిటల్ చెల్లింపుల నిర్ణయం మరింత ఉపయోగపడుతుందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిల్లర సమస్యలు తగ్గాయి..



ప్రతీ రోజూ చిల్లర కోసం తిప్పలు పడడం మా పెద్ద సమస్య. చిల్లర సరిగా ఇవ్వకపోతే ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తారు. కొత్తగా డిజిటల్ చెల్లింపులు వచ్చాక చాలా ఊరట కలిగింది. ఇక చిల్లర కష్టాలు తగ్గి పోతున్నాయి. డిజిటల్ పద్ధతి వల్ల సమయం ఆదా అవడంతోపాటు ప్రయాణికులు సంతోషంగా ఉన్నారు. - బొమ్మెర ఉపేందర్, కండక్టర్

కొనసాగుతున్న డైలీవేజ్ వర్కర్ల సమ్మె



మహబూబాబాద్ అర్బన్: సమ్మెలో పాల్గొన్న వర్కర్లు



కురవి: ఆశ్రమ పాఠశాల వద్ద..

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో, హాస్టల్‌లో డైలీవేజ్ వర్కర్లకు టైం స్కేల్ ఇవ్వాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టల్‌లో విధులు నిర్వహిస్తున్న వర్కర్లు నిరధిక సమ్మె శనివారం రెండోరోజులో భాగంగా సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్, గిరిజన సంఘం అధ్యక్షులు వెంకన్న, మహేష్, కార్మికులు లింగ్య పాల్గొన్నారు.

గూడూరు: కాంటినింజెంట్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండో రోజుకు చేరుకుంది. సమ్మెలో రవి, స్వరూప, నర్సమ్మ, సమ్మక్క, స్వర్ణకుమార్ పాల్గొన్నారు.

కురవి: మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేసే డైలీ వేజ్ వర్కర్లు శనివారం రెండోరోజు సమ్మెలో కూర్చున్నారు. సంఘం నాయకుడు పిట్టల సురేష్, మాట్లాడుతూ.. పాఠశాలలో పనిచేసే వర్కర్లందరిని పర్మనెంట్ చేయాలని, టైంస్కేల్ చేయాలని డిమాండ్ చేశారు.

మరిపెడ రూరల్: కాంటినిజెంట్ ఉద్యోగుల సమస్యలను తక్షణ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శనివారంమండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతి గృహానికి గేటుకు తాళం వేసి నిరవధిక సమ్మెలో ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వర్కర్లు సోమన్న, వెంకన్న, కౌసల్య, నాగలక్ష్మీ, రాజు, ఐలయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి మోదీతోనే సాధ్యం



పెద్దవంగర: మాట్లాడుతున్న రవి

పెద్దవంగర: దేశ అభివృద్ధి ప్రధాని మోదీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కట్టోజు భాస్కరా చారి ఆధ్వర్యంలో సేవా పక్షం మండల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వడ్లకొండ రవి పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 17న జరుగనున్న తెలంగాణ విమోజన దినోత్సవంతో పాటు దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా పక్షం రోజులపాటు మండల బూత్‌స్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మెరుగు సందీప్, ముద్దసాని శ్రీకాంత్, తలారి సోమయ్య, సుధాకర్, రంగు శ్రీనివాస్, ప్రసాద్, బాబు, కిరణ్, గణేష్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఈనెల 17నుంచి 15రోజుల పాటు ప్రతి మండలంలో నిర్వహించే సేవా పక్షం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మధన్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు చందు రాజు, సంతోష్ కుమార్, సురేష్, ముస్తాఫా పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

దంతాలపల్లి: ఈనెల 17న ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకొని మండలస్థాయి, అసెంబ్లీ స్థాయిలో సేవా పక్వాడ పేరుతో 15వ తేదీ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సేవా పక్వాడ కన్వీనర్ ప్రవీణ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు గుగడగాని భరత్ కుమార్ గౌడ్, జిల్లా కౌన్సిలర్ సభ్యురాలు సారెడ్డి రాణిరెడ్డి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కేసముద్రం: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలో ఉన్న వెండి ఆభరణాలను అపహరించిన సంఘటన మున్సిపాలిటీ పరిధి కిష్టాపురం కాలనీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన ఆకుతోట రమేష్ తన కుటుంబ సభ్యులతో విజయవాడలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో వేసిన తాళాన్ని పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న 25 తులాల వెండి ఆభరణాలు, రూ.3వేలను అపహరించుకుని వెళ్లారు. శనివారం ఉదయం ఇంటి పక్కన ఉన్న వారు తలుపులు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి పోలీసులకు, ఆ ఇంటి యజమానికి సమాచారం అందించారు. క్లూస్ టీం చేరుకుని వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విజయవంతం చేయాలి

నెహ్రూసెంటర్: ఈనెల 17వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ శనివారం పిలుపునిచ్చారు. ఈ సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ హాజరవుతున్నారని, వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

విధుల్లో చేరిన జీపీఓలు

గార్ల: గార్ల మండలంలోని 10 రెవెన్యూ గ్రామాలకు జీపీఓలు విధుల్లో జాయిన్ అయినట్లు తహసీల్దార్ ఆర్.శారద శనివారం తెలిపారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



మహబూబాబాద్ అర్బన్: మైనార్టీ గురుకుల పాఠశాలలో వేడుకలు..



డోర్నకల్: సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవం ఉపాధ్యాయులు, విద్యార్థు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమిక్ కోఆర్డినేటర్ నరేష్ మాట్లాడారు. హిందీ భాషా దేశ జాతీయ సమైక్యతకు ప్రతీక అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేముల కల్పన, ఇమాముద్దీన్ మహ్మద్, రామకృష్ణ, వికాస్, రామన్న, లక్ష్మణ్, సురేందర్ పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో శనివారం హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం సరిత ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

మెనూ ప్రకారం అందించాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్: పట్టణంలోని ఎస్సీ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతి బసు డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా జ్యోతి బసు మాట్లాడుతూ.. గురుకులంలో మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తనిఖీలు లేకపోవడంతో వార్డెన్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే బాలికల సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పవన్, రాకేష్, వీరేందర్, వంశీ, అనిల్, యాకన్న, అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల రద్దుకు కుట్రలు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

కేసముద్రం: కార్మిక హక్కులను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్, మూడు వ్యవసాయ సాగు నల్లచట్టాలను తీసుకువచ్చిందని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధి హరిహర గార్డెన్స్‌లో ఐఎఫ్‌టీయూ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. ముందుగా జెండా ఆవిష్కరించి, జాతీయ నాయకులు రాజ్‌సింగ్, జిల్లా కోశాధికారి లక్ష్మయ్య చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ సహాయ కార్యదర్శి గౌని ఐలయ్య, మండల వెంకన్న పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ కవిత

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య స్కూల్‌లో శనివారం పార్లమెంట్ మాక్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత హాజరై మాట్లాడుతూ.. క్రీడల్లో, ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఓర్చుకుని గెలుపునకు బాటలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో వివిధ పదవులకు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మదార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, గెలుపొందిన విద్యార్థులు దిలీప్ కుమార్, నసీమా, కార్తిక్ నాయక్, బిందుప్రియ, శ్రీతన్, అక్షర, హేమంత్, నిహారిక, వర్షిత్, మౌర్య పాల్గొన్నారు.

సాయుధ పోరాటం కమ్యూనిస్టులదే



నివాళులర్పిస్తున్న నాయకులు

కురవి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ముమ్మాటికి కమ్యూనిస్టులదేనని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం అయ్యగారిపల్లి గ్రామంలో సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా అమరవీరుల స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనపై, రజాకార్ల అకృత్యాలపై, దొరలు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలపై కమ్యూనిస్టుల నాయకత్వంలో పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు కందుల యాకయ్య, బుర్ర సమ్మయ్య, బొల్లు వెంకన్న, గజ్జి చంద్రయ్య, కన్నె వెంకన్న పాల్గొన్నారు.

పరిహారం మంజూరు చేసి ఆదుకోండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితులు

డోర్నకల్: సీతారామా ప్రాజెక్ట్ కోసం వాడుకున్న తమ భూములకు పరిహారం మంజూరు చేసి, ఆదుకోవాలంటూ కన్నెగుండ్ల గ్రామానికి చెందిన బాధితులు రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు. మండలంలోని కన్నెగుండ్లకు చెందిన సుమారు పది మంది దళితులకు చెందిన సుమారు నాలుగెకరాల భూమిని 2022లో సీతారామా ప్రాజెక్ట్ కోసం స్వాధీనం చేసుకున్నారు. దళితులైన పది మంది భూములు ఒక్కొక్కరికి తక్కువ విస్తీర్ణంలో ఉండి మొత్తం విస్తీర్ణం నాలుగు ఎకరాలే ఉండటం, భూములకు పట్టాలు లేకపోవడంతో నేటికి బాధితులకు పరిహారం అందలేదు. పట్టాలు ఉన్న చుట్టుపక్కల రైతులకు పరిహారం అంది, తమకు అందక పోవడంతో బాధితులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. భూములకు పట్టాలు లేనందున కోర్టుకు వెళ్లాలని అధికారులు చెబుతున్నారని, బాధితులమంతా వితంతువులు, వృద్ధులమే ఉన్నామని తాము కోర్టు చుట్టూ తిరగలేమని వాపోతున్నారు.

సంక్షిప్త సమాచారం

కొండచిలువ హతం

కురవి: మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం సమీపంలోని రాంచంద్రు అనే వ్యక్తి ఇంట్లోకి శనివారం తెల్లవారుజామున కొండచిలువ రావడంతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే అక్కడికి వచ్చిన జనం ఎనిమిది ఫీట్లు ఉన్న ఆ కొండ చిలువను చంపేశారు.

బీరువా బహూకరణ

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని డాక్టర్ ఎస్‌ఆర్ రంగనాథన్ గ్రంథాలయానికి డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ షేక్ జానీ ఆధ్వర్యంలో బీరువాను శనివారం నిర్వాహకులకు బహూకరించారు. షేక్ జానీ సొంత ఖర్చులతో బీరువాను కొనుగోలు చేసి గ్రంథాలయంలో అందజేశారు.

జయప్రదం చేయండి

బయ్యారం: లంబాడీలపై జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా ఈనెల 14న భద్రాద్రి జిల్లా కొత్తగూడెంలో నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని లంబాడీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో లంబాడీ జేఏసీ నాయకులు మాట్లాడారు. ఈ సమావేశంలో బాబు, రూప్లా, భద్రు, రవీందర్, శ్రీను, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ర్యాలీ



నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రాత్రి గ్రామస్తులతో కలిసి గ్రామంలో కొవ్వొత్తులతో నిరసన తెలిపినట్లు సీపీఎం మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్యనారాయణ, ముఖేష్, అశోక్, రవి, ఐలయ్య, వెంకన్న, వినయ్ పాల్గొన్నారు.

అటెండర్ మృతి

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అటెండర్ జిన్నె అవిలయ్య (43) అనారోగ్యంతో శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. అవిలయ్య స్వగ్రామం వీరారం కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పరామర్శ..

గార్ల: మండలంలోని దేశ్యాతండాకు చెందిన భూక్యా బలరాంనాయక్, బుద్దారం గ్రామానికి చెందిన సంపసాల లాలమ్మ మృతి చెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, గంగావత్ అశోక్, శీలంశెట్టి రమేష్, రాధాకృష్ణ, మీగడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెబ్ ఆప్షన్‌లో నాన్‌లోకల్ చూపిస్తోంది..

- మెడిసిన్ సీటు కోల్పోతున్న విద్యార్థులు



చరణ్‌తేజ్



తేజస్విని

గార్ల: 10వ తరగతి వరకు తెలంగాణలో చదువుకుని, ఇంటర్ ఏపీలోని విజయవాడలో చదువుకోవడం వల్ల మెడిసిన్‌లో నాన్‌లోకల్ సమస్యతో సీటు కోల్పోయే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గార్ల మండలం పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన గంగావత్ చరణ్‌తేజ్ నీట్‌లో 720 మార్కులకు గాను 432 మార్కులు సాధించాడు. అదేవిధంగా సీతంపేట గ్రామానికి చెందిన మాలోత్ తేజస్విని నీట్‌లో 371 మార్కులు సాధించింది. ఎస్టీ విభాగంలో వీరిద్దరికి మెడిసిన్‌లో కచ్చితంగా సీటు వచ్చే అవకాశం ఉంది. కాని వీరిద్దరు ఇంటర్ ఏపీ రాష్ట్రం విజయవాడలో చదవడం వల్ల ఈనెల 11న ప్రారంభమైన నీట్ రాష్ట్ర కౌన్సిలింగ్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే నాన్‌లోకల్‌గా చూపిస్తుందని విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 16 నుంచి నీట్ రాష్ట్ర కౌన్సిలింగ్ ప్రారంభమవుతుందని, కౌన్సిలింగ్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటే నాన్‌లోకల్ అని చూపిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నీట్‌లో నాన్‌లోకల్ సమస్య లేకుండా చర్యలు చేపట్టి విద్యార్థుల తల్లితండ్రులు వేడుకుంటున్నారు.

ప్రారంభానికి చర్యలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని అనంతరం గ్రామ శివారులో గల ఎల్‌సీ 83 రైల్వే గేట్ ప్రాంతంలో ప్రజలు, రైతులు, వాహనదారుల సౌకర్యార్థం నూతనంగా రైల్వే అండర్ బ్రిడ్జిని దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. కాగా ఆర్‌యూబీలో పనులు ముమ్మరం చేసి సాంకేతికపరమైన ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం వాహనాల రాకపోకలు కొనసాగుతున్నప్పటికీ స్వల్పకాలిక మరమ్మతులు పెండింగులో ఉన్నాయి. త్వరలోనే వాటిని కూడా పూర్తిచేసి ఆర్‌యూబీని అధికారికంగా ప్రజల అవసరాల మేరకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సమాజాభివృద్ధికి దోహదపడాలి



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

మహబూబాబాద్ అర్బన్: చదువుతోపాటు పలు సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలని ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ మర్సకట్ల అనిల్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ట్రైబల్ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యాదలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లుగా ఉండి సామాజిక బాధ్యతతో సమాజాభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ శిబిరంలో పరిసరాలు పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, ఆరోగ్య సూత్రాలు, రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బిందుమాధురి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.